



పాలకొండ: ఓనిగెడ్డ కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరదనీరు



జియ్యమ్మవలస: ముంపులో ఉన్న బాసంగి గ్రామం

- లోతట్టు ప్రాంతాలు జలమయం ● ముంపులో గ్రామాలు.. పంటలు
- నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు..
- కరెంట్ సరఫరాకు ఆటంకం ● కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం

ముంచెత్తిన వాన



ఈదురుగాలులుకు నేలవాలిన వరి పైరు

పార్వతీపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా గురువారం జిల్లావ్యాప్తంగా ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరి పొలాలు నీట మునిగాయి. అరటి, మొక్కజొన్న నేలవాలాయి. ప్రధాన కూడళ్ల, రోడ్లపై వర్షపునీరు నిలిచింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. మరోవైపు ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో విజయ దశమి రోజున ప్రజలకు పండుగ సందడి లేకుండాపోయింది. కాగా ఈనెల 4 వరకు భారీగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఏ సమస్య ఉన్నా ప్రజలు ఈ 08963-796085 నెంబర్‌కు ఫోన్ చేయాలని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి సూచించారు. శుక్రవారం పాఠశాలలకు ఆయన సెలవు ప్రకటించారు.

ఇదీ పరిస్థితి..

- పార్వతీపురం మండలం వెంకంపేట గోలీలు వద్ద భారీ చెట్లు, వీరఘట్టం మండలంలో అరటితోటలు నేలకొరిగాయి. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం తదితర మండలాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా స్తంభించింది.
- గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలో నాగావళి నది వరద ప్రవాహంతో ఉగ్రరూపం దాల్చింది. గురువారం పైప్రాంతాల నుంచి 4,500 క్యూసెక్కులు చేరగా, స్పిల్‌వే గేట్లు నుంచి 14 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. శుక్రవారం 33 వేల క్యూసె క్కులు చేరగా 14,650 క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. కొద్ది గంటల వ్యవధిలోనే మళ్లీ 46 వేల క్యూసెక్కుల వరద చేరింది. అధికారులు అప్రమత్తమై 28 వేల క్యూసెక్కులను విడిచిపెట్టారు. సాగునీటి అవసరాల నిమిత్తం 720 క్యూసెక్కులను ప్రధాన కాలువల నుంచి సరఫరా చేస్తున్నారు. మరోవైపు నదీ తీర ప్రాంతవాసులకు హెచ్చరికలు జారీ చేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు.
- భామిని మండలంలో గెడ్డవాగులు ఉప్పొంగాయి. వంశధార నదీ తీర ప్రాంతాల్లో పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. దిమ్మిడిజోల నుంచి సతివాడ వెళ్లే మార్గంలో చెట్లు నేలకొరిగాయి. మొక్కజొన్న పత్తి, వరిపైరు నేలమట్టం

(మిగతా 6వ పేజీలో...)



సాలూరు మండలం తోణాంలో గాలులకు ధ్వంసమైన అరటి



కొమరాడ: వరదనీటిలో కళ్లికోట రహదారి

వర్షపాతం నమోదు ఇలా..

సీతంపేట మండలంలో అత్యధికంగా 72.9 మిల్లీమీటర్లు, అత్యల్పంగా గరుగుబిల్లి మండలంలో 17.3 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. వీరఘట్టం-51, భామిని-65.2, పాలకొండ-48.6, కొమరాడ-70.3, గుమ్మలక్ష్మీపురం-72.2, కురుపాం-64.1, జియ్యమ్మవలస 54.7, పార్వతీపురం-41.5, మక్కువ-32.9, సీతానగరం- 35.5, బలిజిపేట-48.6, సాలూరు-38.1, పాచిపెంట-51.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

అప్రమత్తంగా ఉండాలి: మంత్రి అచ్చెన్న

విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు సూచించారు. శుక్రవారం కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎస్పీ మాధవ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. నేలకొరిగిన చెట్లను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. వరద పరిస్థితిని అంచనా వేయాలని, కాలువలు, చెరువులకు గండ్లు పడకుండా పర్యవేక్షించాలని సూచించారు.

ప్రాణనష్టం జరగకుండా చూడగలిగాం

సాలూరు: వర్షాలకు సంబంధించి ముందస్తు జాగ్రత్తవల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడగలిగామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం సాలూరులో విలేకరులతో మాట్లాడుతూ వర్షం తీవ్రతపై పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లతో మాట్లాడానన్నారు.

పైడిమాంబ ఆలయానికి
ధర్మకర్తల మండలి

- నేడు ప్రమాణ స్వీకారం?

విజయనగరం రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ ఆలయ ధర్మకర్తల మండలిని నియమిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాలకు ధర్మకర్తల మండళ్లని నియమించినా ఈ దేవస్థానానికి ఇంతవరకు నియామకం జరగలేదు. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు వచ్చాయి. తాజాగా ప్రభుత్వం ధర్మకర్తల మండలిని నియమిస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. ధర్మకర్తల మండలికి చైర్మన్‌గా దేవస్థానం వంశ పారంపర్య ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు, సభ్యులుగా కె.కామేశ్వరరావు, జి.ఆనందరావు, ఎల్.కుమారి, వి.వెంకటలక్ష్మి, డి.కృష్ణంరాజు, పి.రామయ్యపంతులు, ఎల్.స్వాతికుమారి, కె.తులసీ, డి.పద్మావతి, కె.గోపాల్‌రెడ్డి నియమితులయ్యారు.

- ప్రభుత్వం ధర్మకర్తల మండలికి సంబంధించి ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సోమవారం తొలేళ్ల ఉత్సవం ప్రారంభం కానునుండంతో దేవస్థానం అధికారులు శనివారం నాడే ప్రమాణ స్వీకారం చేయించేలా ప్రణాళిక రూపొందించారని తెలిసింది.



గురుకులంలో
కలవరం

- కురుపాం గిరిజన సంక్షేమ పాఠశాలల విద్యార్థినులకు అస్వస్థత
- అందరికీ జాండీస్ లక్షణాలు ● అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ
- జిల్లా కేంద్రాసుపత్రిలో 58 మందికి చికిత్స ● సేవలపై కలెక్టర్ ఆరా
- రాష్ట్ర వైద్య బృందం పరిశీలన

పార్వతీపురం/బెలగాం/ కురుపాం, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు పచ్చకామెర్ల లక్షణాలతో అస్వస్థతకు గురికావడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ఇద్దరు బాలికలు మృతి చెందగా.. మరోవైపు రోజురోజుకూ ఆసుపత్రుల్లో చేరిన విద్యార్థినుల సంఖ్య పెరుగుతుండడం కలకలం రేపుతోంది. ఒకే పాఠశాలకు చెందిన వారు ఇలా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంపై కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు శుక్రవారం వైద్య, ఆరోగ్య శాఖకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆ పాఠశాలలో చదువుతన్న 611 మంది విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. అదే విధంగా ఇన్‌పేషెంట్లుగా చేరిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.



చికిత్స పొందుతున్న విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

విస్తృతంగా వైద్య సేవలు

దసరా సెలవులు ఇచ్చిన తర్వాత ఈ పాఠశాల విద్యార్థినులు స్వగ్రామాలకు వెళ్లారు. అలా వెళ్లిన వారిలో గుమ్మలక్ష్మీపురం మండలం కంబగూడ గ్రామానికి చెందిన పువ్వల అంజలి జాండీస్ లక్షణాలతో గతనెల 26న మృతి చెందింది. ఈ నెల ఒకటో తేదీన కురుపాం మండలం దండుసూర గ్రామానికి చెందిన తోయక కల్పన విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించింది. మరికొందరు విద్యార్థినులు పచ్చ కామెర్ల లక్షణాలతో ఆసుపత్రుల్లో చేరడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రంగంలోకి దిగింది. దసరా సెలవుల నిమిత్తం ఇళ్లకు వెళ్లిన ఆ పాఠశాల విద్యార్థినుల వద్దకు వైద్య సిబ్బంది వెళ్లి రక్త నమూనాలు సేకరించారు. శుక్రవారం వాటిని పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. సాలూరు, కురుపాం సీహెచ్‌సీల్లోనూ విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాకేంద్రాసుపత్రిలో 58 మంది విద్యార్థినులు చికిత్స పొందుతుండగా.. వారిలో టెన్త్, ఇంటర్ చదువుతున్న హిమరిక షర్మిల, ఎం.అనిత పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. వారిలో ముగ్గురు ఏకలవ్య పాఠశాల విద్యార్థినులున్నారు. మరోవైపు ప్రిన్సిపాల్ అనురాధను సస్పెండ్ చేస్తూ గురుకుల కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు.



జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

బాలికల ఆరోగ్య పరిస్థితిపై ఆరా

జిల్లాకేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను శుక్రవారం కలెక్టర్ పరామర్శించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాలికలకు పూర్తిగా నయమైన తర్వాతే డిశ్చార్జి ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. ' కురుపాం పాఠశాలకు చెందిన విద్యార్థినులు దసరా సెలవుల నిమిత్తం ఇళ్లకు వెళ్లిన తర్వాత వారిలో పచ్చకామెర్లు లక్షణాలు ఉన్నట్టు రక్త పరీక్షల ద్వారా గుర్తించాం. కొంతమందిని జిల్లా ఆసుపత్రికి

(మిగతా 6వ పేజీలో...)

గాంధీ ఆశయ సాధనకు
కృషి చేయాలి

6లో

తొమ్మిది శిశు సంరక్షణ కేంద్రాల గుర్తింపు

స్వచ్ఛ మునిసిపాలిటీగా సాలూరు

6లో

ముగిసిన కోటదుర్గమ్మ ఉత్సవాలు

- రేపు తిరువీధి

పాలకొండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పాలకొండ కోట దుర్గమ్మ దసరా ఉత్సవాలు ముగిశాయి. విజయదశమి రోజున అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. తొలుత ఆలయ ప్రధాన అర్చకుడు డి. లక్ష్మీప్రసాదశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకు మార్చనలు చేశారు. ఈవో వి.వి.సూర్యనారాయణ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. భారీ వర్షం కారణంగా భక్తులు కాస్త ఇబ్బంది పడ్డారు. నూతన వాహనాల పూజలకు ఆటంకం కలిగింది. ఈదురుగాలుల వల్ల ఆలయంలో టెంట్‌లు నేలకూలాయి. దీనితో సాయంత్రం వరుణుడు శాంతించిన తర్వాత భక్తుల తాకిడి పెరిగింది. క్యూలైన్‌లో వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో గత ఏడాది మాదిరిగానే కుంకుమపూజలు చేసే ప్రాంతం నుంచి భక్తులను ఆలయం లోపలికి పంపించారు. ఆ క్రమంలో రద్దీను నియంత్రించడం పోలీసులకు కష్టసాధ్యమైంది. కాగా విజయదశమి రోజున వాతావరణం అనుకూలించకపోవడంతో అమ్మవారు తిరువీధిని వాయిదా వేశారు. ఈ నెల 5న ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ఈ కార్యక్రమం చేపట్టనున్నారు.



తోటపల్లిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

6లో

బొడికొండలో ఏనుగుల తిష్ఠ



ఆటోడ్రైవర్లలో జోష్

- నేడు వారి ఖాతాలో జమకానున్న రూ.15 వేలు
- జిల్లా వ్యాప్తంగా 5,217 మందికి లబ్ధి
- 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమానికి ఏర్పాట్లు



పార్వతీపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఒక్కొక్కరి ఖాతాల్లో రూ.15 వేలు శనివారం జమ చేయనుంది. ఇటీవల స్త్రీశక్తి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ పథకం ప్రారంభించిన సంగతి తెలిసిందే. రోజుకు లక్షలాది మంది ఈ పథకాన్ని వినియోగించుకుం టున్నారు. ఈ క్రమంలో తమకు ఉపాధి లేకుండా పోతోందని ఆటో డ్రైవర్లు ఆందోళన చెందారు. గమనించిన సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లను తప్పకుండా ఆదుకుంటామని చెప్పారు. అందులో భాగంగా 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని ప్రకటించారు. అర్హులైన ఆటో డ్రైవర్లను ఎంపిక చేసి వారి ఖాతాల్లో శనివారం రూ.15 వేల చొప్పున నిధులు జమ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విజయ వాడలో సీఎం చంద్రబాబు పథకాన్ని లాంఛనంగా ప్రారంభించను న్నారు. జిల్లాలోని 5,217 మందిని అర్హులుగా గుర్తించారు. వారికి రూ.7.82 కోట్లను జమ చేయనున్నారు. పార్వతీపురం నియోజక వర్గంలో 1549 మందికి, కురుపాం 1347, పాలకొండలో 1251, సాలూరులో 1070 మందికి లబ్ధిచేకూరనుంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో మంత్రి, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు శనివారం జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనున్నారు.

గోడ కూలి ఒకరు మృతి

7లో

కౌలు రైతు ఆత్మహత్యాయత్నం

7లో

బైక్ అదుపు తప్పి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

డీసీసీబీ కార్యాలయం మీ జాగీరా?

7లో

- డీసీసీబీ చైర్మన్ నాగార్జున

కొత్త గురువులకు శిక్షణ

సాలూరు రూరల్, అక్టోబరు 3 (ఆంధ్ర జ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన కొత్త టీచర్లకు శిక్షణ ప్రారంభమైంది. శుక్రవారం డెంకాడ మండలం మోదవలస ఓయోస్టార్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు వారంతా హాజరయ్యారు. రెసిడెన్షియల్ తరహాలో ఈ నెల 10 వరకు శిక్షణ కొనసాగుతుంది. ఉమ్మడి జిల్లాలో 266 ఎస్జీటీలు, పాఠశాల సహాయకుల విభాగంలో సోషల్ స్టడీస్ 67, ఫిజిక్స్ 56, బయాలజీ 36, గణితం 33, తెలుగు 14, హిందీ 14, ఆంగ్లం 30, ఫిజికల్ డైరెక్టర్ 62 పోస్టులకు 578 మందిని మెగా డీఎస్సీలో ఎంపిక చేసిన విషయం విదితమే. సబ్జెక్టుల వారీగా ఓయోస్టార్ స్కూల్‌లో వారికి గదులు కేటాయించి శిక్షణ కార్యక్రమాన్ని ఆరంభించారు. కాగా కొత్త గురువులు సమయానికి అర గంట ముందే శిక్షణ వేదికకు చేరుకున్నారు. వారికి కేటాయించిన గదుల్లో బోధన తదితర అంశాలపై రిసోర్స్‌పర్సన్లు పలు విషయాలు వివరించారు. శిక్షణ అనంతరం కొత్త టీచర్లకు ఉమ్మడి జిల్లాలో పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను కేటాయించనున్నారు.



ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా

● పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలు విన్నవించిన ప్రతి సమస్యను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీకార్యాలయంలో ప్రజదర్బార్ నిర్వహించారు. ప్రజలు అందించిన వినతులను స్వీకరించి పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అలాగే ఆటో, మ్యాక్సీకాబ్, మోటార్ క్యాబ్ కలిగి అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నవారికి వాహనమిత్ర పథకం అందుతుందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పేర్కొన్నారు. టీడీపీ కార్యాలయంలో పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాలకు సంబంధించిన ఎంపీడీవోలు, ఆయా మండలాల నాయకుతో శనివారం జరగనున్న ఆటో డ్రైవర్స్ సేవా పథకం కార్యక్రమంపై సమీక్షించారు.


మాట్లాడుతున్న విజయచంద్ర

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు

●బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు జరుగుతుందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు.మండలంలోని కొత్తపెంటలో శుక్రవారం సూపర్ జీఎస్టీపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ నూతనంగా ప్రవేశ పెట్టిన జీఎస్టీ 2.0 విధానంలో వ్యవసాయ వస్తువులపై ఇంతకుముందు ఉండే 18 లేదా 15 శాతం జీఎస్టీ ప్రస్తుత నూతన విధానంలో 5 శాతానికి తగ్గించడం వల్ల రైతులకు వివిధ వస్తువులు పరికరాలపై 7 శాతం లాభం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో మజ్జి శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.అలాగే జీఎస్టీ తగ్గింపుపై నియోజకవర్గం నోడల్ అధికారి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలు దేశ చరిత్రలో నూతన అధ్యాయంగా మిగిలిపోతుందన్నారు. కార్య క్రమంలో డీడీవో ఎం.కిరణ్‌కుమార్, తహసీల్దార్ ఎ.శ్రీను, డెప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు పాల్గొన్నారు.

●రామభద్రపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వాణిజ్య పన్నుల శాఖాధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం ఆయన మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఎల్‌డీవో కిరణ్‌కుమార్, ఎంపీడీవో రత్నం పాల్గొన్నారు.



బొబ్బిలి రూరల్: కొత్తపెంటలో అవగాహన ర్యాలో పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన

బొడికొండలో ఏనుగుల తిష్ఠ


బొడికొండ వద్ద ఏనుగులు సంచరిస్తున్న దృశ్యం

పార్వతీపురం రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనారాయణరం సమీపంలో ఉన్న బొడికొండ వద్ద ఏనుగులు తిష్ఠవేశాయి. సమీప ప్రాంతాల్లో ఉన్న పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తున్నాయి. శుక్రవారం బొడికొండ వద్ద ఏనుగులు జొన్న, వరి పంటను ధ్వంసం చేశాయి. మండలంలోని పెదమరికి, చిన్నమరికి, బండిదరవలస తదితర గ్రామాలకు చెందిన వ్యవసాయాలను ఏనుగులు ఇటీవల ధ్వంసం చేసిన విషయం విదితమే. కొద్దిరోజులుగా ఏనుగులు మండలంలోని ఉండడంతో రైతులు పంట పొలాల వైపు వెళ్లలేని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

తోటపల్లిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గరుగుబిల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తోటపల్లిలోని వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల్లో శుక్రవారం ఘనంగా శ్రీబ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉభయ దేవస్థానాల పరిధిలో ఆలయ ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులు సుప్రభాతసేవ, బాలభోగం, మంగళాశాసనం, శాత్తుముర్రై, వాస్తుయోగీశ్వర మండపారాదనలు విశేష హోమాలు, ధ్వజారోహణం, శాత్తుముర్రైతో పాటు పవిత్రలాంకృతం, చక్రాభ్య అర్చనతో పాటు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ మాట్లాడుతూ దేవస్థానాల పరిధిలో ఆదివారం వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముగింపు సందర్భంగా నాగావళి నదీ తీర ప్రాంతంలో శ్రీచూర్ణోత్సవం, శ్రీచక్ర తీర్థ స్నానాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

పాలకొండ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):సమస్యలు పరిష్కరమే ధ్యేయమని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు.శుక్రవారం మండలంలోని అంపిలిలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో తూర్పుకాపు స్టేట్ డైరెక్టర్ గండి రామినాయుడు పాల్గొన్నారు.

●కొమరాడ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సివినిలో సర్పంచ్ బోనెల పుష్పలత అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఉపాధిహామీ ఆడిట్‌కు సంబంధించి తీర్మానించారు. గ్రీన్ అంబాసిడర్లకు, ఎంపీటీసీ సభ్యులు దేవకోటి వెంకటనాయుడు యూనిఫారాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● గరుగుబిల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలు పూర్తిస్థాయిలో అభివృద్ధికి గ్రామసభలు దోహదపడతాయని ఎంపీడీవో జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావులు సూచించారు. శుక్రవారం మండలంలోని పెద్దూరులో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ టి.యల్లంనాయుడు, ఏపీవో ఈశ్వరమ్మ, గృహ నిర్మాణశాఖ జేఈ వి.అఖిల్, కార్యదర్శి బి.అప్పారావుతో పాటు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ మునిసిపాలిటీగా సాలూరు

సాలూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ మున్సిపాలిటీగా సాలూరు మునిసిపాలిటీ ఎంపికైనట్టు మునిసిపల్ కమిషనర్ రత్నకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఆరు వార్డులు, రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ వారియర్స్ అవార్డులు కైవశం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

తొమ్మిది శిశు సంరక్షణ కేంద్రాల గుర్తింపు

పార్వతీపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బాలల న్యాయ చట్టం- 2015 ప్రకారం జిల్లాలో తొమ్మిది శిశు సంరక్షణా కేంద్రాలను గుర్తించినట్లు కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో శిశు సంరక్షణా కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ అనంతలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

కురుపాం కోటలో ఆయుధ పూజ

కురుపాం,అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): కురుపాం కోటలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ కుటుంబ సభ్యులతో కలిసి పూర్వీకులు వినియోగించే కత్తులు, తుపాకులకు ఆయుధ పూజ వేశారు. అలాగే మాజీ ఎంపీ వైరచర్ల ప్రదీప్‌కుమార్‌దేవ్ కోటలో ఆయుధ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అలాగే స్థానిక రావాడ కూడలి వద్ద ఉన్న కోటలో గల ఆలయంతో పూజలు నిర్వహించారు.

జమ్మి చెట్టుకు పూజలు

సాలూరు రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సాలూరులో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. సాలూరు సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు బంగారు వర్ణశోభితంగా గోవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కాగా దసరా ఉత్సవాలను గురువారం సాలూరు అర్బన్,రూరల్‌లో నిర్వహించారు. సాలూరు పంచముఖేశ్వర ఆలయంలో హరుని లింగానికి లక్ష రుద్రాక్షలతో అలంకరించారు.

● మక్కువ రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ రాజరాజేస్వరీ దేవీ అవతారంలోశరన్నవరాత్రిఉత్సవాల్లో భాగంగా భక్తులకు దర్శనమిచ్చారు.ఉత్సవాలు ముగింపు పురస్కరించుకుని భక్తులుఊరేగింపుగా వచ్చి జమ్మిచెట్టుకు పూజలు జరిపారు.

గుమ్మలక్ష్మీపురంలో జీఎస్టీపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం,అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జీఎస్టీపై శుక్రవారం అవగాహనకార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర పన్నులశాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బి.జ్ఞానప్రసూనాంబ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం జీఎస్టీ రేట్లు తగ్గించడం వల్ల ప్రజలకు ఆర్థికభారం తగ్గుతుందన్నారు. కార్య క్రమంలో వస్తు సేవా పన్ను అధికారి డి.శ్రీనివాస్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ కె.విజయ్‌కుమార్, డి.తిరుపతి పాల్గొన్నారు.

19 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

బొబ్బిలి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఐటీఐ కాలనీకి చెందిన నాగేశ్వరరావు 19 మద్యం సీసాలను అక్రమంగా కలిగి ఉండడంతో శుక్రవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్ఐ డి. కొండలరావు తెలిపారు. సీఐ కటకం సతీష్‌కుమార్‌కు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా నాగేశ్వరరావు దగ్గర మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. నిందితుని అరెస్టుచేసి బొబ్బిలి ఏజెఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఏఎస్ఐ కొండలరావు తెలిపారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

రామభద్రపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని ఏవో అమరా శివ కోరారు. రామభద్రపురంలో విలేకరులతో మాట్లాడుతూ రసాయన ఎరువులను ఇష్టారాజ్యంగా వాడడంవల్ల నేల స్వభావం దెబ్బతినడమే కాకుండా రైతులు ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు.

గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి

గాంధీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం గాంధీ జయంతి పురస్కరించుకుని జిల్లాలో విగ్రహాలు, చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలోని మార్కెట్‌కు వెళ్లే మార్గంలో ఉన్న మాత్మాగాంధీ విగ్రహానికి ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్య క్రమంలో కూటమి నాయకులు చిన్న, దొరబాబు, రాఏష్, రాజేష్, మన్మథ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

●సాలూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర సముపార్జనలో గాంధీజీ కీలక భూమికి పోషించారన్నారు.

● సీతానగరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఆర్యవైశ్య సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విశ్వేశ్వరరావు, మండల కమిటీ అధ్యక్షుడు కూర్మదాసు లక్ష్మణరావు తెలపారు. సీతానగరంలోని గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సేవా సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

● సీతంపేట రూరల్,అక్టోబర్ 3(ఆంధ్రజ్యోతి):స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఏవో సునీల్ ఆధ్వర్యంలో గాంధీజయంతిని నిర్వహించారు.కార్యాలయ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఉద్యోగులు ఆదినారాయణ,శ్రీనివాసరావు,మురళీనాయుడు పాల్గొన్నారు.

● పాలకొండ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీజీ, లాల్‌బహుదూర్‌శాస్త్రి జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అధ్యక్షతన గాంధీజీ స్తూపానికి, లాల్‌బహుదూర్‌శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేశారు. దే కార్య క్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.


సాలూరు:గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి


గుమ్మలక్ష్మీపురం: గాంధీ విగ్రహానికి పూలమాల వేసిన విప్ జగదీశ్వరి

గాంధీ విగ్రహం తల తొలగింపుపై దర్యాప్తు

●మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విగ్రహం పునరుద్ధరణ

సాలూరు రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లిలో జడ్పీ ఉన్నత పాఠశాలలో గాంధీ విగ్రహం తల తొలగించడంపై హెచ్ఎం ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. డీఈవో ఆదేశాల మేరకు విగ్రహాన్ని ఉపాధ్యాయులు పునరుద్ధరించారు. స్థానికులు, ఎస్ఐ నర్సింహమూర్తి కథనం మేరకు.. మామిడిపల్లిలో జడ్పీ ఉన్నత పాఠశాలలో గాంధీ జయంతి పురస్కరించుకుని విగ్రహం వద్ద గురువారం హెచ్ఎం,సాలూరు ఎంఈవో-2 నల్ల వెంకటరావు నివాళులర్పించారు. సాయంత్రం వరకు వాచ్‌మెన్ పి.పోలినాయుడు అక్కడే ఉన్నారు. తర్వాత వాచ్‌మెన్ ఇంటికి భోజనానికి వెళ్లిపోయారు.ఆయన ఇంటికి వెళ్లి వచ్చే సరిగా గుర్తుతెలియని వ్యక్తులు వంటశాల తలుపులు బద్దలు కొట్టి తెరిచారు. అనంతరం వారు గాంధీ విగ్రహం తలను వేరుచేసి పక్కన పెట్టారు.గాంధీ విగ్రహం తల వేరుచేసిన విషయం వాచ్‌మెన్ రెండో ఎంఈవో, హెచ్ఎం వెంకటరావుకు తెలియజేశారు.డీఈవో రాజ్‌కుమార్ సమాచారం తెలియడంతో తక్షణమే విగ్రహాన్ని పునరుద్దరించాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం రాత్రి పాఠశాల ఆవరణలోని విగ్రహానికి రంగుల వేసి పునరుద్ధరించారు. విగ్రహం తల తొలగించిన సంఘటన నేపథ్యంలో సాలూరు రూరల్ ఎస్ఐ నర్సింహమూర్తి పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. హెచ్ఎం ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు. కాగా ఈ విషయం శుక్రవారం గ్రామస్థులకు తెలియడంతో విచారం వ్యక్తం చేశారు.


గాంధీ విగ్రహం తల తొలగించిన దృశ్యం


పునరుద్ధరించిన దృశ్యం

వట్టిగెడ్డ దిగువన మినీ వంతెన నిర్మించాలి

జియ్యమ్మవలస, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వట్టిగెడ్డ ప్రాజెక్టు దిగువన మినీ వంతెన (కాజ్‌వే) నిర్మించాలని తూర్పు ఏజెన్సీ ప్రాంత గిరిజనులు నిరసన తెలిపారు. శుక్రవారం వరద భారీస్థాయిలో ప్రాజెక్టుకు వచ్చి చేరడం వల్ల నీటి పారుదలశాఖ అధికారులు స్పిల్‌వే ద్వారా దిగువకు నీటిని విడిచిపెట్టారు. దీంతో కురుపాం నుంచి తూర్పు ఏజెన్సీలోని పంచాయతీలకు వెళ్లే మార్గం, ప్రాజెక్టు దిగువన రోడ్డుపై నుంచి ఉధృతంగా నీరు ప్రవహిస్తోంది. దీంతో గిరిజనాభ్యుదయ సంఘంజిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గిరిజనులు అక్కడే కాసేపు నిరసన తెలిపారు. కాజ్‌వే (మినీవంతెన) నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకపోతే టీకే జమ్ము, పీటీమండ, కొండచిలకాం, అలమండ పంచాయతీల్లోని 30 గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడక తప్పదని వారు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వట్టిగెడ్డ రిజర్వాయర్ దిగువన ప్రధాన రహదారిపై మినీ వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు.


వంతెన నిర్మించాల్సిన ప్రాంతంలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

గురుకులంలో కలవరం

(5వ పేజీ తరువాయి)

తీసుకొచ్చి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. 58 మంది విద్యార్థినులు చికిత్స పొందుతున్నారు. ఇందులో 20 మంది పూర్తిస్థాయిలో కోలుకుంటున్నారు. వారిలో ఇద్దరు విద్యార్థినులకు కేజీహెచ్‌కు రిఫెర్ చేశాం. మిగిలిన బాలికలు ఇంటిలో ఉన్నా లేదా హాస్టల్ ఉన్నా వారికి ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడానికి, పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను నియమించాం. విద్యార్థినుల అస్వస్థతకు గల కారణాలను తెలుసుకోవడానికి రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను ఆ ప్రాంతానికి పంపించాం. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. మరోవైపు రాష్ట్ర వైద్య బృందం కూడా పాఠశాలకు వెళ్లింది. ఆహార పదార్థాలు, తాగునీటి శాంపుల్స్‌ను సేకరించింది. త్వరలోనే నివేదికలు అందించనున్నారు. ఇంకా ఎవరైనా బాలికలు అనారోగ్యంతో బాధపడుతుంటే వారిని తల్లిదండ్రులు సమీప ఆసుపత్రికి తరలించాలి.' నాటు వైద్యం ప్రమాదకరం. అత్యవసర సమయాల్లో సీహెచ్‌సీ, పీహెచ్‌సీల ద్వారా వైద్య సేవలు పొందాలి. ఆర్ఎంపీలు, నాటు వైద్యుల వద్దకు వెళ్లరాదు. అంబులెన్స్‌లతో పాటు ఐటీడీఏల నుంచి కూడా ప్రత్యేక వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చాం.' అని తెలిపారు. ఆయన వెంట జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి , డీసీహెచ్ఎస్ నాగభూషణరావు, సూపరింటెండెంట్ నాగశివజ్యోతి, చిన్న పిల్లల వైద్య నిపుణుడు గణేష్ చైతన్య తదితరులు ఉన్నారు.

కురుపాంలో ప్రత్యేక వైద్య పరీక్షలు ...

● డీఎంహెచ్‌వో భాస్కరరావు పర్యవేక్షణలో కురపాంలో విద్యార్థినులకు శుక్రవారం రక్త పరీక్షలు నిర్వహించారు. బాలికల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా కలెక్టర్ ఎస్.ప్రభాకర్ రెడ్డి ఆ పాఠశాలకు చేరుకుని విద్యార్థినులు, తల్లిదండ్రులు, వైద్య సిబ్బందితో మాట్లాడారు. వారికి అందిస్తున్న వైద్య సేవలపై డీఎంహెచ్‌వోతో చర్చించారు. బాలికలతో సహా తల్లిదండ్రులందరూ రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సెలవుల్లో ఇంటికి వెళ్లిన విద్యార్థినులు సరైన వైద్యం చేయించుకోపవడం వల్లే ఇలా జరిగిందని తెలిపారు. శుక్రవారం ఎనిమిది మందిని కురుపాం ఆసుపత్రి నుంచి పార్వతీపురం జిల్లా ఆసుపత్రి పంపించామన్నారు. పాఠశాలకు కొత్త ఆర్‌వో ప్లాంట్ కొనుగోలు చేశామని వెల్లడించారు.

● కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన సుమారు 58 మంది విద్యార్థినులు పచ్చకామెర్లతో బాధపడుతున్నట్లు వైదులు నిర్ధారించారు. శుక్రవారం విజయవాడ నుంచి వచ్చిన ముగ్గురి వైద్యులతో పాటు విజయనగం మెడికల్ కళాశాలకు చెందిన నాలుగురు డాక్టర్ల బృందం పాఠశాలను పరిశీలించింది. కురుపాం ఆసుపత్రిలో డాక్టర్లతో మాట్లాడారు. కలుషిత నీరే కారణమని ప్రాథమికంగా అంచనా వేశారు.

యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం

'కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినుల్లో కొంతమంది పచ్చకామెర్లతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని.. వెంటనే కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడాం. జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం. ఇప్పటికే ఇద్దరు బాలికలు పచ్చకామెర్ల లక్షణాలతో మృతి చెందడం బాధాకరం. మరికొంతమంది జాండీస్‌తో బాధపడుతుండడంతో వైద్య సిబ్బంది బాలికలందరికీ రక్త పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. రాష్ట్ర వైద్య బృందం ఆ పాఠశాలను సందర్శించింది. త్వరలోనే నివేదిక అందించనుంది. దసరా సెలవుల నిమిత్తం ఇళ్లకు వెళ్లిన బాలికలు అస్వస్థతకు గురికావడానికి గల కారణాలు తెలుసుకొని అవసరమైన చర్యలు తీసుకుంటాం. ముందుగా ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేశాం. ' అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

ముంచెత్తిన వాన

(5వ పేజీ తరువాయి)

కావడంతో రైతులు ఆందోళన చెందారు. పాలకొండ సబ్ కలెక్టర్ స్వప్నిల్ శుక్రవారం వరద ప్రాంతాన్ని పరిశీలించారు. బత్తిలికి చెందిన పశువుల కాపర్లు గురువారం ఇంటికి చేరకపోవడంపై ఆరా తీశారు. నేరడి, లివిరి నదతీర ప్రాంతాన్ని పరిశీలించారు. కాగా వర్షాలు, వరదలు వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే జయకృష్ణ పేర్కొన్నారు. ఘనసర, కీసర, కొసలి, సింగిడి గ్రామాల్లో పర్యటించారు.

● కొమరాడ: కళ్లికోట జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఆ గ్రామానికి నాగావళి నదికి మధ్యలో భారీగా వరద నీరు చేరింది. దీంతో గ్రామస్థుల రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు. మరోవైపు 25 ఎకరాల వరకూ వరి, క్యాబేజీ తదితర పంటల్లో నీరుచేరింది. కళ్లికోట గ్రామానికి ప్రభుత్వవిప్ తోయక జగదీశ్వరి పరిశీలించారు. నష్టపోయిన రైతులకు నివేదిక తయారుచేసి పరిహారం చేస్తామని చెప్పారు. కాగా జంఝావతి, నాగావళి నదుల సంగమంలో ఉన్న గుంప సోమేశ్వరాలయం ఆలయం రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీటిలో చిక్కుకుంది. ఆలయం మీద గోపురానికి దగ్గరగా నీరు ప్రహిస్తోంది.

● గుమ్మలక్ష్మీపురం భారీ వర్షాలకు నాలుగు ఇళ్లు కూలినట్టు తహసీల్దార్ శేఖరం తెలిపారు. సెంటర్‌గూడలో ఒక ఇళ్లు, పెంగువ, వాడపుట్టి గ్రామాల్లో ఒక్కొక్క ఇళ్లు కూలిపోయాయన్నారు.

● జియ్యమ్మవలస: నిర్వాసిత గ్రామం బాసంగిని నాగావళి వరద నీరు చుట్టు ముట్టింది. దీంతో నిర్వాసితులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. కొందరు గ్రామస్థులు విషయాన్ని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరికి తెలియజేశారు. శుక్రవారం ఆమెతో పాటు సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆ గ్రామాన్ని పరిశీలించారు. బాసంగి, కళ్లికోట, సుంకి గ్రామాల్లో నిర్వాసితులు పడుతున్న కష్టాలను సీఎం దృష్టికి తీసుకెళ్తామని ప్రభుత్వ విప్ హామీ ఇచ్చారు. ● పాలకొండ: ఓని సమీపంలో గెడ్డపై కాజ్‌వేపై నుంచి వరదనీరు ప్రవహించడంతో గుడివాడ, ఓని, స్కాట్‌దొరవలస తదితర గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా రావాడగెడ్డ కాజ్‌వేపైకి వరదనీరు చేరడంతో అవలంగి, ఆర్‌బిఆర్‌పేట, డోలమడ, ఎం.సింగుపురం వాసులకు అవస్థలు తప్పలేదు.

● మక్కువ రూరల్ : దుగ్గేరు, నందలో మొక్కజొన్న, అరటి పంటలకు భారీనష్టం వాటిల్లింది.


భామిని: సొలికిరిలో పత్తి పొలాల్లో వంశధార వరదనీరు


గరుగుబిల్లి: స్పిల్‌వే నుంచి దిగువకు నీటిని విడుదలచేస్తున్న దృశ్యం

6,7 తేదీల్లో సర్పంచ్‌లకు శిక్షణ

గరుగుబిల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 25 పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఈ నెల 6, 7 తేదీల్లో శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. శుక్రవారం గరుగుబిల్లిలో విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీల పరిధిలో నిధులు సమకూర్పుపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

మాజీ కౌన్సిలర్ పార్వతి మృతి


పార్వతి(ఫైల్)

పార్వతీపురంటౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి: మునిసిపాలిటీలోని నాలుగో వార్డు మాజీ కౌన్సిలర్ గొర్లి పార్వతి గురువారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యం బాధపడుతున్న ఆమె గురువారం ఉదయం 11 గంటల సమయంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 2005 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ తరఫున కౌన్సిలర్‌గా ఎన్నికై నాలుగో వార్డు ప్రజలకు సేవలందించారు. అలాగే కోఆపరేటివ్ బ్యాంకు వైస్‌చైర్మన్‌గా బాధ్యతలను నిర్వర్తించారు. గురువారం పట్టణ శివారుల్లో గల శ్మశానవాటికలో పార్వతీకి భర్త గొర్లి శంకరరావు అంతిమ సంస్కారాలను నిర్వహించారు. పార్వతీ కుమారుడు గొర్లి మాధవరావు సామాజిక సేవకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

ప్రజలకు తాగునీటి సరఫరా

పాలకొండ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్‌జీఆర్ చారిటబుల్ ట్రస్టు పేరుతో ప్రజల సౌకర్యార్థం ట్యాంకర్‌తో ఉచితంగా తాగునీటిని అందిస్తున్నామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. మండలంలోని ఎస్.కెరాజపురంలో ఆయుధ ఎన్‌జీఆర్ చారిటబుల్ ట్రస్టు సమకూర్చిన వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గండి రామినాయుడు, కొండదాడి రాజష్, టి.మురళి పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

గరుగుబిల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనచోదకుల ప్రాణాలకు హెల్మెట్ రక్షణగా ఉంటుందని ఎస్ఐ ఫక్రుద్దీన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని గొట్టివలస, గరుగుబిల్లి, ఉల్లిభద్ర ప్రాంతాల్లో హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. రోజువారీ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు వెళ్లే సిబ్బంది విధిగా హెల్మెట్ తోనే ప్రయాణం చేయాలన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

పాచిపెంట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాంచాళిలో శుక్రవారం స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీని అధికారులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, మాట్లాడుతూ మండలానికి 14,973 స్మార్ట్ కార్డులు మంజూరయ్యాయని, వీటిలో 1427 కొత్తస్మార్ట్ కార్డులు ఉన్నా యన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.రవి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300



సీఎం సభ విజయవంతం

గంట్యాడ అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గజపతినగరం నియోజకవర్గం దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలోని ముఖ్యమంత్రి సభ విజయవంతం అయ్యిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం గంట్యాడ గ్రామంలోని ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడరు. సీఎం సభను విజయవంతం చేసినందుకు జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు, ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

బెలగాం/ పార్వతీపురం రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సిపురం రైల్వే గేట్ సమీపంలో రైలు ఢీకొని శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు కథనం మేరకు.. నర్సిపురం గ్రామానికి చెందిన సంధాన సింహాచలం(59) బహిర్భూమికి వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా యశ్వంత్ పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొట్టడంతో మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భోగాపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): భోగాపురంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయని సీఐ కె.దుర్గాప్రసాదరావు తెలిపారు. ముంజేరు పంచాయతీ జగ్గయ్యపేటకు చెందిన నక్కా రమణ ముంజేరు వైపు నుంచి భోగాపురం వైపు స్కూటీపై వస్తున్నాడు. అలాగే భోగాపురం పంచాయతీ అప్పన్నపేటకు చెందిన వనుం నరిశింహులు భోగాపురం వైపు నుంచి ముంజేరు వైపు బైకుపై వెళ్తున్నాడు. గంగిరావి గట్టు సమీప రహదారిపైకి వచ్చేసరికి రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వారిద్దరూ విజయనగరం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

నేడు బైక్ ర్యాలీ

రాజాం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఫ్యాప్టో పోరుబాట పేరిట శనివారం అన్ని మండల కేంద్రాల్లో చేపట్టనున్న బైకు ర్యాలీని విజయవంతం చేయాలని ఆ సంఘం సమన్వయ కమిటీ నాయకులు రెడ్డి మోహన్‌రావు, మజ్జి మదన్‌మోహన్‌కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తాలూకా కేంద్రంలో బ్రోచర్‌ను విడుదల చేశారు.

జాతీయ నాటక పోటీల్లో మెరిసిన గరివిడి కళాకారులు

గరివిడి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తెనాలి వేదికగా గురువారం జరిగిన జాతీయ పద్య నాటక పోటీల్లో ఆదికవి నన్నయభట్టు నాటకం ఘన విజయం సాధించింది. ఈ నాటకానికి ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ రచన, ఉత్తమ నటుడు విభాగాలలో అవార్డులు దక్కాయి. ఈ నాటకంలో గరివిడికి చెందిన యజ్ఞపురపు సత్యం రాజరాజ నరేంద్రునిగా, వీవీఎస్ఎన్ గుప్తా వేదవ్యాసునిగా, భటునిగా కుమరాపు పైడినాయుడు మాస్టారు విశేషంగా ఆకట్టుకున్నారు.

నేడు ఆటో డ్రైవర్లకు చెక్కుల పంపిణీ

రాజాం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాజాంలో ఆటో డ్రైవర్లకు ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ శనివారం చెక్కులు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నంది సూర్యప్రకాష్‌రావు, శాసపు రమేష్ కుమార్, బీసీ సెల్ నాయకుడు పిల్లా సత్యం నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

అనధికార ఆర్వో ప్లాంట్లు నిర్వహిస్తే చర్యలు

విజయనగరం టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని నిబంధనలకు వ్యతిరేకంగా ఆర్వో ప్లాంట్లను నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. నగరంలోని ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్లాంట్ల నిర్వాహకులు 24 గంటల్లోగా నీటి నమూనాలను తన వద్దకు తీసుకు రావాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన నాయకులు

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను టీడీపీ నాయకులు పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, గాడు అప్పారావు, కెల్ల సూరిబాబు, ప్రసాద్ ప్రభు, రౌతు శ్రీనివాసరావులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ● పైడిమాంబ సిరిమానోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఎస్పీని కోరారు. గురువారం ఆయన్ని తన చాంబర్లో కలిసి, సత్కరించారు.

రీసర్వేలు ఉపయోగకరంగా ఉండాలి

ఎస్.కోట రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గతంలో చేసిన రీసర్వేల వల్ల గ్రామాల్లో భూ సమస్యలు అధికం అయ్యాయని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. శుక్రవారం బొడ్డవర గ్రామంలో తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన రీసర్వే గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. రీసర్వేలు రైతులకు పనికొచ్చే విధంగా చేయాలని కోరారు. అయితే ర్యాలీకి సంబంధించిన బ్యానర్‌పై తన ఫొటో లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ మీనా పాల్గొన్నారు.

● పూసపాటిరేగ: కొల్లాయివలస పంచాయతీలో శుక్రవారం నుంచి భూముల రీసర్వే ప్రారంభించారు. మండలంలో అత్యధికంగా డీపట్టా, ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్న పంచాయతీ ఇదే కావటం విశేషం.

మహాత్ముని ఆశయాలను కొనసాగించాలి

● ఘనంగా గాంధీ జయంతి

గంట్యాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహాత్ముని ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత నేటి తరానికి ఉందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం గాంధీ జయంతి సందర్భంగా గంట్యాడ గ్రామంలోని తన స్వగృహంలో ఆయన గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు బూడి అప్పలనాయుడు, రఘుమండ శ్రీను, సురేష్, కనుకు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



గంట్యాడ: గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్



కలెక్టరేట్: గాంధీ, లాల్ బహదూర్ చిత్రపటాలకు పూలమాల వేస్తున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

నేటి తరానికి స్ఫూర్తి ప్రదాతలు

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నేటి తరానికి స్ఫూర్తి ప్రదాతలు మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలోజాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు. వారి చిత్ర పటాలకు పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తోపాటు జేసీ సేతు మాధవన్, డీఆర్‌వో శ్రీనివాస్ మూర్తి, సీపీవో బాలాజీ, డీఈవో మాణిక్యంనాయుడు, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య ఉన్నారు.

మహాత్ముడి మార్గాన్ని ఆచరించాలి

విజయనగరం క్రైం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గం ప్రతిఒక్కరూ ఆచరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. మహాత్మాగాంధీ జయంతి వేడుకలను గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గాంధీ చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరరావు, ఆర్ఐలు గోపాలనాయుడు, రమేష్‌కు మార్, పి.శ్రీనివాసరావు తోపాటు ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలపై దుర్గమ్మ ఆశీస్సులు ఉండాలి

విజయనగరం క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు దుర్గమ్మ ఆశీస్సులు ఉండాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. దుర్గాష్టమి సందర్భంగా గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసులు విధి నిర్వహణలో వినియోగించే తుపాకులు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీసు సిబ్బంది, అధికారులకు ఎస్పీ దంపతులు శుభాకాంక్షలు తెలిపారు. ఏఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరరావు, ఆర్ఐలు గోపాలనాయుడు, రమేష్‌కుమార్, శ్రీనివాసరావుతో పాటు ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

● అనంతరం మూడు లాంతర్ల వద్ద ఉన్న పైడిమాంబ చదురుగుడిలో ఎస్పీ తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి, పైడిమాంబ ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందజేశారు.



ఆయుధాలకు పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ దామోదర్ దంపతులు

టెన్నికాయిట్ రాష్ట్ర జట్టు ఎంపిక

చీపురుపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఈనెల 8 నుంచి జరగనున్న టెన్నీ కాయిట్ పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్టు పెదనడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల సీనియర్ నేషనల్ ఉమన్స్ కోచింగ్ క్యాంపు శిక్షకుడు ఎం.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జట్టులో ఆర్.మౌనిక, శ్రావణి, కె.ఇందు(విజయనగరం), జి.హేమసుందరి(పశ్చిమగోదావరి), జి.సుప్రియ (అనంతపురం), మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో పి.రేణుక, ఎస్.రాహుల్ (విజయనగరం) స్థానం సంపాదించినట్టు తెలిపారు. 49వ సీనియర్ నేషనల్ టెన్నీకాయిట్ చాంపియన్‌షిప్-2025 పోటీలు ఈనెల 8 నుంచి 12 వరకూ ఉత్తరప్రదేశ్‌లోని నొయిడాలో నిర్వహిస్తారని ఆయన వివరించారు. ఇదిలా ఉండగా అలుగోలు గ్రామానికి చెందిన మత్స రామప్పడు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు క్రీడాకారులకు ఉచిత వసతి, భోజనం, దుస్తులు, బూట్లు సమకూర్చనున్నట్టు రామారావు తెలిపారు.

ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమపై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

గరివిడి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో కుమారం పంచాయతీ పరిధిలో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ స్థాపనపై విచారణ, అభిప్రాయ సేకరణ నిర్వహిస్తు న్నట్టు రాష్ట్ర కాలుష్య నియంత్ర మండలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. షోభా మెటల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో సర్వే నెంబర్లు 136/1, 136/5, 136/5ఎలో ఈ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.150 కోట్లుగా అంచనా వేశారు. ఈసందర్భంగా ముసాయిదా పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక, తెలుగు, ఇంగ్లీష బాషలలో కార్యనిర్వాహక సారాంశాలు సిద్ధం చేసి ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ప్రజా విచారణ శనివారం ఉదయం 11 గంటలకు కుమరాం గ్రామంలోని ప్రతిపాదిక ప్రాజెక్టు స్థలంలో నిర్వహిస్తారని, ఈ విచారణలో పాల్గొని ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని తహసీల్దార్ చింతా బంగార్రాజు తెలిపారు.

సేంద్రియ పంటలతో ఆరోగ్యం

కొత్తవలస, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో పండించే పంటలే ఆరోగ్యకరమని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. శుక్రవారం దెందేరు గ్రామంలో ప్రకృతి సాగు ద్వారా పండిస్తున్న పంటలను ఆయన స్థానిక వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయాధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు.

గ్రామ సభలకు హాజరు కావాలి

కొత్తవలస, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేస్తున్న గ్రామ సభలకు అన్ని శాఖల ఉద్యోగులు తప్పనిసరిగా హాజరు కావాలని డివిజనల్ పంచాయతీ అధికారిణి శిరీషారాణి అన్నారు. శుక్రవారం కొత్తవలస-4 సచివాలయ పరిధిలో సర్పంచ్ మచ్చరామస్వామి, ఈవోపీఆర్డీ శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభకు ఆమె హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వైద్య శాఖ నుంచి ఎవరూ హాజరు కాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ ఈవో శైలజ పాల్గొన్నారు.

గోవా గవర్నర్‌ను కలిసిన మార్క్‌ఫెడ్ చైర్మన్

భోగాపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజును రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు శుక్రవారం విజయనగరంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పలు విషయాలపై చర్చించారు.

స్టాక్‌లో తేడాలుంటే చర్యలు తప్పవు

విజయనగరం టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని స్టాక్ విషయంలో తేడాలొస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ సంచాలకురాలు టి.విమలారాణి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని సంజీవ నగర్‌కాలనీ, బొగ్గులదిబ్బ కేంద్రాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా కేంద్రాలలో ఉన్న స్టాక్‌తో పాటు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక దాత చంద్రకళ ఇచ్చిన యూనిఫారాలను చిన్నారులకు అందజేశారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాలకు మేలు

● ఎమ్మెల్యే కళావెంకటరావు

చీపురుపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణల వల్ల అన్ని వర్గాలకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. పట్టణంలోని వైశ్య వర్తక సంఘ భవనంలో శుక్రవారం వ్యాపారులకు జరిగిన జీఎస్టీ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గతంలో నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం రెండు శ్లాబులకు కుదించిందన్నారు. దీని వల్ల అన్ని రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల అవినీతి తగ్గుముఖం పడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, రౌతు కామునాయుడు, ముల్లు రమణ, బీజేపీ నాయకులు ఇప్పిలి నీలకంఠం, కళింగ కోమటి సంఘం అధ్యక్షుడు పొట్నూరు నరసింగరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

● గరివిడి: జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర వస్తువులు ధరలు భారీగా తగ్గనున్నాయని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. మండలం లో గరివిడి, తోండ్రంగి గ్రామాల్లో జీఎస్టీ తగ్గింపుపై శుక్రవారం ఆయన ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. టీడీపీ నాయకులు పైల బలరాం, బలగం వెంకటరావు, సారిపాక సురేష్‌కుమార్, తహసీల్దార్ బంగార్రాజు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

సీతంపేట రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగతిపల్లి సమీపంలో ఉన్న వ్యూ పాయింట్ అందాలను చూసేందుకు స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనాలతో కొండపైకి వెళ్లి తిరుగు ప్రయాణంలో బైక్ అదుపుతప్పడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతిచెందాడు. ఎస్ఐ వై.అమ్మనరావు కథనం మేరకు.. పాలకొండ పట్టణానికి చెందిన సాహిని సాయికృష్ణ (28) తోటి స్నేహితులతో కలిసి దసరా సందర్భంగా సీతంపేట ప్రాంతంలోని జగతిపల్లి వ్యూపాయింట్‌ను చూసేందుకు ద్విచక్ర వాహనాలపై బుధవారం సాయంత్రం వెళ్లారు. అక్కడ వ్యూపాయింట్ అందాలను ఆస్వాదించి తిరుగు ప్రయాణంలో ఘాట్ రోడ్డులోని మలుపు వద్ద సాహిని సాయికృష్ణ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం బోల్తాకొట్టింది. దీంతో సాయికృష్ణ తలకు తీవ్ర గాయంకావడంతో స్నేహితులు సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతు గురువారం మృతిచెందాడు. సాయికృష్ణకు తమ్ముడు ఉన్నాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న తమ కుమారుడు సాయికృష్ణ మృతితో తల్లి, స్నేహితులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఎస్ఐ అమ్మన్నరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



సాయికృష్ణ (ఫైల్)

డీసీసీబీ కార్యాలయం మీ జాగీరా?


విజయనగరం రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమానోత్సవాన్ని డీసీసీబీ కార్యాలయం నుంచి వీక్షిస్తామని, ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ రెండు జిల్లాల అధికారులకు, దేవదాయశాఖ అధికారులకు లేఖ రాయడం అహంకారపూరిత ధోరణిగా కనిపిస్తోందని డీసీసీబీ చైర్మన్ నాగార్జున మండిపడ్డారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. డీసీసీబీ అనేది ప్రభుత్వ సంస్థని, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ సొంత జాగీరు కాదని ఆయన ధ్వజమెత్తారు. శాసనమండలిలో వ్యవస్థలపై మాట్లాడే ఆయన.. విజయనగరం డీసీసీబీకి వచ్చేసరికి వ్యవస్థలను మరిచిపోతున్నారా? అంటూ ప్రశ్నించారు. ఎవరిని అడిగి, డీసీసీబీలో ఏర్పాట్లు చేయమని లేఖ రాశారని ఆయన ప్రశ్నించారు. డీసీసీబీ చైర్మన్‌గా తాను, డీసీఎంఎస్ చైర్మన్‌గా గంపా కృష్ణతో పాటు 94 వ్యవసాయ పరపతి సంఘాలకు అధ్యక్షులు ఉన్నారన్న విషయం ఎమ్మెల్సీ బొత్స మరిచిపోయారా.. అంటూ ప్రశ్నించారు. ఇప్పటికే తనతో పాటు పీఏసీఎస్ అధ్యక్షులు, డీసీఎంఎస్ చైర్మన్, అధికారులు అంతా డీసీసీబీ ప్రాంగణం నుంచి సిరిమాను వీక్షించాలని ఇప్పటికే నిర్ణయించామని తెలిపారు. ఈ నిర్ణయం జరిగిన తర్వాత ఎమ్మెల్సీ బొత్స లేఖ రాశారన్నారు. ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అహంకార ధోరణి విడనాడి సిరిమాను వీక్షణ విషయం లో రాజకీయం చేయకుండా హుందాగా వ్యవహరించాలన్నారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ నాగార్జున

ఎవరూ పట్టించుకోరా?

ఎస్.కోట రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గత 106 రోజులుగా శాంతియుత పోరాటం చేస్తున్న తమను ఏ ప్రజాప్రతినిధి పట్టించుకోకపోవడం దౌర్భాగ్యమని జిందాల్ నిర్వాసితులు వాపోయారు. శుక్రవారం బొడ్డవరలో నిర్వహించిన రిలే దీక్షలో వీరికి మద్దతుగా ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్షన్-30 నక్కపల్లిలో అమల్లో ఉన్నా హోంమంత్రిని అడ్డుకుని ప్రశ్నించారని.. అయినా ఒక్కరిపైన ఒక్క బైండోవర్ లేదని, కానీ ఇక్కడ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న హరిజన, గిరిజనులపై బైండోవర్ కేసులు పెట్టడం దారుణమన్నారు.



రిలే దీక్షలో పాల్గొన్న నిర్వాసితులు

13న బ్రాహ్మణ యువతకు జాబ్‌మేళా

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో డిసెంబరు 13న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ శ్రీనివాస్ తెలిపారు. గాజులరేగలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈ మేళా ద్వారా వెయ్యి మంది బ్రాహ్మణ యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యం పెట్టుకున్నట్టు తెలిపారు. గుంటూరు జిల్లాలోని అమరావతి రోడ్డులో గల హిందీ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో డిసెంబరు 13న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఈ మేళా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేళాలో పాల్గొనే అభ్యర్థులకు భోజన సౌకర్యం కల్పిస్తారని చెప్పారు. అభ్యర్థులు 63099 66644, 94947 79979 నెంబర్లకు ఫోన్ చేసి, తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు ద్వాదశి వేణు, వేల్పూరి గంగరాజు, రాకేష్‌శర్మ, బమిడిపాటి రామ్‌గోపాల శర్మ, రామాయణం సత్యనారాయణశర్మలు పాల్గొన్నారు.

పూడికలు తొలగించరూ..

బొండపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దేవుపల్లి గ్రామంలో కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గురువారం కురిసిన అకాల వర్షానికి మురుగంతా రోడ్డుపైకి ప్రవహించింది. దీంతో స్థానికులు స్పందించి ఇళ్ల ముందు నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా కాలువలను శుభ్రం చేసుకున్నారు.

ఆరు నెలలకు ఒకసారే..

ప్రభుత్వం ఆరు నెలలకు ఒకసారే పారిశుధ్య పనులు చేపట్టమన్నదని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఆదేశించారు. గత మే 26న రూ.75వేల ఖర్చుతో పారిశుధ్య పనులు చేపట్టాం. త్వరలో పనులు చేపడతాం.

- వాడాడ సత్యవతి, కార్యదర్శి, దేవుపల్లి సచివాలయం



కాలువలో వ్యర్థాలు తొలగిస్తున్న వృద్ధురాలు

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

కొత్తవలస, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కంటకాపల్లి పంచాయతీ కొత్తసుంకరపాలెంలో సిమెంట్ కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న తమడపు రాము(52) అనుమానాస్పదంగా మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస పంచాయతీ బలిఘట్టాం గ్రామానికి చెందిన తమడపు రాము గురువారం మరో ఇద్దరు కార్మికులతో కలిసి ద్విచక్ర వాహనంపై కర్మాగారానికి వెళ్లారు. అయితే కర్మాగార పని నిమిత్తం లేబర్ కార్మికుల కాలనీలో ఆయన దిగిపోయారు. మిగిలిన ఇద్దరు కర్మాగారానికి వెళ్లిపోయారు. తిరిగి విధులు పూర్తి చేసుకుని వారిద్దరూ ఇంటికి రాగా, రాము మాత్రం ఇంటికి రాలేదు. దీంతో రాము భార్య వెంకటలక్ష్మి గురువారం రాత్రంతా కర్మాగార పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ దొరకకపోవడంతో శుక్రవారం ఉదయం మళ్లీ గాలించారు. కొత్తూరు గ్రామానికి వెళ్లే చెరువులో మృతదేహం తేలియాడుతూ కనిపించింది. మృతదేహాన్ని బయటకు తీశారు. రాముకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా, చిన్న కుమార్తె డిగ్రీ చదువుతోంది. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ యువరాజ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కౌలురైతు ఆత్మహత్యాయత్నం

కొమరాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పంటలు నీటమునగడంతో పార్వతీపురం మన్యం జిల్లాలో ఓ కౌలు రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. జియ్యమ్మవలస మండలం గెడ్డ తిరువాడ గ్రామానికి చెందిన బీద రాము(50) కొమరాడ మండలం కళ్లికోట గ్రామంలో ఉంటూ రెండు ఎకరాలను కౌలుకు తీసుకున్నాడు. అందులో క్యాబేజీ, చిక్కుడు, కాయగూరలు పండిస్తున్నాడు. అయితే గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పంటలన్నీ నీట మునిగాయి. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. అపస్మారక స్థితికి చేరుకున్న ఆయన్ని కుటుంబ సభ్యులు గుర్తించి.. వెంటనే పార్వతీపురంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం

బాడంగి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మునిసిపాలిటీలోని కోరాడవీధికి చెందిన పాటోజు యోగీశ్వరరావు (21) ఈనెల ఒకటో తేదీన వేగావతి నదిలో గల్లంతుకాగా గురువారం మృతదేహం లభ్యమయ్యింది. పోలీసుల కథనం మేరకు.. పోలీసుల కథనం మేరకు.. యోగీశ్వరరావు భవాని మాల ధరించి తోటి భక్తులతో ఒకటో తేదీ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జె.రంగరాయపురం వద్ద స్నానానికి దిగి గల్లంతయ్యాడు. రెండోతేదీన మధ్యాహ్నం మూడు గంటలకు బాడంగి మండలంలోని అల్లు పాల్తేరు వద్ద వేగావతి మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో తండ్రి వీరాచారి తన కుమారుడిగా గుర్తించడంతో స్థానిక సీహెచ్‌సీకి మృతదేహాన్ని తరలించారు. యోగీశ్వరరావు ఏసీ మెకానిక్‌గా పనిచేస్తుండగా రెండో కుమారుడు బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. చేతికి అందివచ్చిన కొడుకు నదిలో పడి చనిపోవడంతో తల్లి సుజాత కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. రెండో తేదీన తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ తారకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం స్థానిక సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించి పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసినట్టు పోలీసులు తెలిపారు.

మద్యం అనుకుని పురుగు మందు తాగి..

● చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామభద్రపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నివలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందాడని ఎస్ఐ వెలమలప్రసాద్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. జన్నివలస గ్రామానికి చెందిన పత్తిగుళ్ల రామకృష్ణ(42) రామభద్రపురంలో సిమెంట్ గోదాములో కళాసీగా పనిచేస్తున్నాడు. గతనెల 29న మద్యం బాటిల్ కొనుగోలు చేసుకొని ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత పత్తిచేనుకు పురుగు మందు కొట్టడానికి తెచ్చిఉంచుకున్న పురుగు మందుల బాటిల్‌ను మద్యం సీసా పక్కన ఉంచాడు. మద్యం అనుకుని పురుగు మందు తాగేశాడు. దీంతో వెంటనే ఆయన బంధువులు సాలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి విజయనగరం ఆసుపత్రికి తరలించగా శుక్రవారం రాత్రి చికిత్సపొందుతూ మృతిచెందాడు. రామకృష్ణ భార్య పత్తిగుళ్ల సింహాచలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రామకృష్ణకు మృతదేహాన్ని బాడంగి ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో ఆత్మహత్య

సీతానగరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణారాయపురం గ్రామానికి చెందిన పెరుమాళి సింహాచలం(57) మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. కృష్ణారాయపురం గ్రామానికి చెందిన పెరుమాళి సింహాచలం బుధవారం బొబ్బిలిలో కుమార్తె ఇంటికి నందెన్న ఉత్సవాల విషయమై చర్చించడానికి వెళ్లాడు. అక్కడి పిల్లలు తన మాట వినడం లేదని మనస్థాపానికి గురయ్యాడు. అక్కడి నుంచి స్వగ్రామం వస్తుండగా మార్గమధ్యలో కొనుగోలుచేసిన పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. ఇంటికి వచ్చిన కొద్ది సేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో భార్య గౌరీ, కుమారుడు కలిసి చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య పెరుమాళి గౌరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.రాజేష్ తెలియజేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రేగిడి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందారు. ఈ ఘటన ఉణుకూరు గ్రామం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉణుకూరు గ్రామానికి చెందిన వంజరాపు సుబ్బినాయుడు(57) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. బహిర్భూమికి వెళ్లి తిరిగివస్తుండగా బూరాడ నుంచి వంగర వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఈయన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. ఈయనకు భార్య లక్ష్మి, ముగ్గురు వివాహితులైన కుమార్తెలు ఉన్నారు. ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గోడకూలి ఒకరు..

కురుపాం, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదయపురం కాలనీలో అన్నదమ్ముల మీద గోడకూలిన సంఘటనలో కుంబరుక అరవిందు(20) మృతి చెందాడు. తమ్ముడు వినాయకరావు గాయాలయ్యాయి. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు ఉదయపురం కాలనీలో అన్నదమ్ములు అరవిందు, వినాయకరావు మట్టి ఇల్లులో నివాసం ఉంటున్నారు. గురువారం కురుసిన గాలి వర్షానికి బాగా తడవడంతో శుక్రవారం ఉదయం కుంబురుక అరవిందు,వినాయకరావుపై మట్టిగోడ పడడంతో వెంటనే భద్రగిరి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అరవిందు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వినాయకరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అరవింద్ డిగ్రీ పూర్తి చేసి కుటుంబానికి భరోసాగా ఉంటాడనే సమయంలో ఇలా మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరువుతున్నారు. నీలకంఠాపుం పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

EDUCATION
» Open 10th/Inter/Degree మరియు Govt University లో ODL Degree మరియు PG Admissions జరుగుచున్నవి. Degree ఫెయిల్ అయిన స్టూడెంట్స్ Degree పూర్తి చేయు అవకాశం కలదు. Pass గ్యారెంటీ. సంప్ర :7997296796.
AJV_ 241548

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు : ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు:
9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266



బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

- మావోయిస్టుల ఘాతుకం
- బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా జిలాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 421మంది మావోయిస్టులు అరెస్టయ్యారని, 410 మంది లొంగి పోయారని, 137 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని వెల్లడించారు.

అసభ్య పోస్టుల కేసులో అంజద్ బాషా పీఏ అరెస్టు

- కడప కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు

కడప క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పదజాలంతో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పీఏ షేక్ మహ్మద్‌ఖాజాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతన్ని కడప ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. సొంత పూచీకత్తుపై అతనికి కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ వివరాలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ విలేకరులకు వివరించారు. కడప అక్బర్ వీధికి చెందిన షేక్ మహ్మద్ ఖాజా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పీఏగా పనిచేస్తున్నాడు. 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై కడప అలంఖాన్‌పల్లెకు చెందిన విజయలక్ష్మి అసభ్యకరంగా మాట్లాడారు. ఆ వీడియోను అంజద్‌బాషా అతని సోదరుడు అహ్మద్‌బాషా ప్రోద్బలంతో సోషల్ మీడియాలో షేక్ మహ్మద్‌ఖాజా పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అంజద్‌బాషా, అహ్మద్‌బాషా, షేక్ మహ్మద్‌ఖాజాలపై కేసు నమోదు చేశారు. షేక్ మహ్మద్ ఖాజాను బుధవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హజరు పరిచారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

'సిట్' ముందు హాజరైన మిథున్‌రెడ్డి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడలోని సిట్ అధికారుల ముందు శుక్రవారం హాజరయ్యారు. ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరవ్వాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో షరతు విధించింది. దాని ప్రకారం మిథున్‌రెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చి పుస్తకాల్లో సంతకం చేశారు. ఇటీవలే ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన విషయం తెలిసిందే.



సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

'సత్యసాయి' ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

- గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి ధ్యేయమైన విలువలు, కరుణ, ప్రేమతో కూడిన అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ అనే భారతీయ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్లు ఈ రోబోటిక్ శస్త్ర చికిత్స వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఈ వ్యవస్థతో శరీరంలోని సున్నితమైన ప్రాంతాలకు కూడా అత్యంత కచ్చితత్వంతో, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సులభతరంగా చేయవచ్చని వెల్లడించారు. రోబోటిక్ సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని స్పష్టం చేశారు.



రోబోటిక్ సర్జరీ యంత్రాలు

ములకలచెరువు కేంద్రంగా
నకిలీ మద్యం తయారీ

- రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం
- స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్.. 9 మంది అరెస్టు



నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న దృశ్యం.. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాక్సులు

రాయచోటి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి రూ.1.75కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న పాత డాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ మద్యం షాపులకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దతిప్ప సముద్రం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి శుక్రవారం ఈ దాడులు చేశారు. 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం సీసా మూతలు.. స్టిక్కర్లు, మద్యం బాటిళ్లు తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి, నకిలీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, అనందన్, ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిథున్, విశాఖపట్నానికి చెందిన స య్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభు త్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేశారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

నిందితుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి పీఏ

రాజేశ్ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్నారు. ఇతని పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీలో జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.

గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు రిమాండ్

- గత నెల 25న చిత్తూరు సమీపంలో బాలికపై అఘాయిత్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగర సమీపంలో ఉన్న నీవా నగర వనం పార్కుకు వచ్చిన యువ జంటను ముగ్గురు యువకులు బెదిరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ జంటలోని యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన మహేష్, కిశోర్, హేమంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు పోక్సో కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. నిందితుల్లో ఒకరైన మహేష్ ఓ బాలికను ఈవ్ టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్ షాపులో పనిచేస్తుండగా అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని అతనిపై కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియో తీసి వారిని బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. లైంగిక వేధింపులకు పాల్పడటం.. వీరి నేర ప్రవృత్తిగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా.. నిందితుల్ని స్థానిక డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

హోటల్ సిబ్బందిపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ దాడి

- అల్పాహారం ఆలస్యంగా ఇచ్చారని దౌర్జన్యం
- ఇరువురికి గాయాలు.. కేసు నమోదు



హోటల్ యజమాని కొడుకు ప్రేమ్‌కుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పాహారం తీసుకురావడంలో ఆలస్యం అయిందని హోటల్ యజమాని, సిబ్బందిపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అతని అనుచరులు రెచ్చిపోయారు. వారిపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడి ఘటన గురువారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకాసెంటర్‌లో జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో నాగార్జున యాదవ్ అతని అనుచరులు పట్టణంలోని గుడ్‌మార్నింగ్ హోటల్‌కు టిఫిన్ చేసేందుకు వచ్చారు. టిఫిన్ అందించడం ఆలస్యమవుతుందని నాగార్జునయాదవ్ అతని అనుచరులు గొడవకు దిగారు. హోటల్ యజమాని శేఖర్, అతని కుమారుడు ప్రేమ్‌కుమార్, వర్కర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, వర్కర్‌కు గాయాలయ్యాయి. తనతో పెట్టుకుంటే అబ్బూరు ఊరు ఊరంతా కదిలొస్తుందంటూ హోటల్ యజమాని శేఖర్‌ను నాగార్జున యాదవ్ బెదిరించారు. దాడి ఘటనపై హోటల్ యజమాని శేఖర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



హోటల్ యజమానిపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నాయకుడు యనమల నాగార్జునయాదవ్

గాలీవాన బీభత్సం

- నేలకొరిగిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు
- అరటి, బొప్పాయి, మొక్కజొన్న పంటలకు నష్టం
- అనేక గ్రామాల్లో అంధకారం



భామినిలో వంశధార ఉధృతి

ఉమ్మడి జిల్లా ఆంధ్రజ్యోతి బృందం, అక్టోబరు 3

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో ఉమ్మడి జిల్లా అంతటా భారీ వర్షాలు కురిశాయి. గాలీవాన బీభత్సం సృష్టించింది. బుధ వారం అర్ధరాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకూ ఎడతెరిపి లేకుండా ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి వృక్షాలు నేలకొరిగాయి. రాజాం మండలం ఒమ్మి గ్రామ సమీపంలో భారీ వృక్షం రోడ్డుపై అడ్డంగా పడి పోవడంతో సుమారు నాలుగు గంటల పాటు ఇరువైపులా వాహనాలు నిలిచి పోయాయి. బొబ్బిలి మండలంలో అరటి, చెరకు, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. పూస పాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లో సుమారు 25నుంచి 30 ఎకరాల్లో అరటి, బొప్పాయి పంటలు నేలకొరిగాయి. గజపతినగరం మండలంలోని చిట్టయ్యవలస గ్రామంలో భారీ వర్షాలకు తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి ఐదు గేదెలు శుక్రవారం మృతిచెందాయి. చంపావతి నదీ ప్రవాహం ఉధృతం కావడంతో గజపతినగరం మండలంలోని మర్రివలస గ్రామం మీదుగా వెళ్లే ఐదు గ్రామాల రాకపోకలు నిలిచిపోయాయి. నాగావళి, వేగావతి, సువర్ణముఖి నదులు పొంగడంతో వంగర మండలంలోని మడ్డువలస రిజర్వాయర్‌లో అధికంగా నీరు చేరింది. దత్తిరాజేరు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఈదురుగాలులతో కూడిన వర్షానికి మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. వివిధ గ్రామాల్లో 17 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం, సాలూరు, మక్కువ, భామిని తదితర మండలాల్లో అరటి, మొక్కజొన్న, పత్తి పంటలు నీట మునిగాయి. మరోవైపు జలాశయాలు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తు న్నాయి. కురుపాం మండలంలో ఉదయంపురం కాలనీకి చెందిన కె.అరవింద్ గోడకూలి మృతి చెందాడు. జియ్యమ్మవలస మండలం నిర్వాసిత గ్రామం బాసంగిని వరద నీరు చుట్టు ముట్టింది.



బొబ్బిలి రూరల్: కొత్తపెంటలో నేలకొరిగిన అరటి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన



సీతంపేట రూరల్:చింతమానుగూడ గ్రామంలో ఓ ఇంటిపై నేలకొరిగిన భారీ చెట్టు



వీరఘట్టం: కంబరలో నేలకొరిగిన అరటి పంట



పాచిపెంట: సతాభిలో నేలకొరిగిన మొక్కజొన్న..



కొమరాడ: వరద ముంపులో ఉన్న సోమేశ్వర దేవాలయం



వీరఘట్టం: కంబరలో అరటితోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ



బొబ్బిలి: కృష్ణాపురం రోడ్డులో విద్యుత్ వైర్లపై నేలకూలిన స్తంభం



కురుపాం: పూతికవలసలో నేలకొరిగిన అరటి పంటను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి



జియ్యమ్మవలస: రావాడ వద్ద వట్టిగెడ రిజర్వాయర్ సమీపంలో రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు



గరుగుబిల్లి: రావివలస, నందివానివలస ప్రాంతాల్లో నేలకొరిగిన అరటి పంట



మెంటాడ: పోరాంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట



వంగర: నాగావళిలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు



రేగిడి: సంకిలి వంతెన వద్ద నాగావళికి వరదపోటు



రాజాం రూరల్: గురవాం వద్ద నేలకూలిన భారీ చెట్టు



సంతకవిటి: పొలాల్లో పడిన విద్యుత్ స్తంభం



మెరకముడిదాం: నీటి ట్యాంకరు వద్ద పడిగాపులు



గజపతినగరం: మర్రివలస వద్ద ఉధృతంగా చంపావతి నది



భోగాపురం: పంట కాలువ పూడుకుపోవడంతో జాతీయ రహదారిపై నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు



గుమ్మలక్ష్మీపురం: పెంగువ గ్రామంలో కూలిన రేకుల ఇల్లు